క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

చందన స్వామిని దర్శించుకున్న వాసుపల్లి


సింహాద్రినాథుని సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం సింహాచల చందన స్వామిని దర్శించుకున్నారు. స్వామికి గర్భగుడిలో తులసి మాల సమర్పించి పూజలు జరిపారు. అనంతరం కప్పస్తంభం వద్ద ఆలింగనం చేసుకొని స్వామిని స్మరించుకున్నారు. దక్షిణ నియోజకవర్గంతోపాటు విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలపై శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి చల్లని ఆశీస్సులు ఉండాలని వాసుపల్లి ఆకాంక్షించారు.

జామ్ ఎంట్రన్స్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఐఐటీ జామ్ ఎంట్రన్స్ పరీక్షలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో రాజ్‌గిరి బంగారి, ఐఐటీ మద్రాస్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ఎం.హేమలత సీట్లు దక్కించుకున్నారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎ.వి.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాకు అన్నాభిషేకం చేస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్ గాంధీ కాలనీలో షిర్డీ సాయిబాబా మహరాజ్ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ దీపాలు, పచ్చని కొమ్మలతో అలంకరించారు. బాబాను నూతన వస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.వి.రమణకుమార్, వ్యవస్థాపకురాలు ఉదయలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు.. స్వామికి అన్నాభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. పెదగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్ గాంధీ కాలనీ, క్రాంతినగర్, విజయదుర్గా కాలనీ, హనుమంతవాక, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

• పండుటాకుల పింఛన్ కష్టాలు


టౌన్‌కొత్తరోడ్డు యూనియన్ బ్యాంక్‌లో పింఛనుదారుల నిరీక్షణ


బ్యాంక్ ముందు పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు

పింఛన్ నగదు కోసం లబ్ధిదారులు బ్యాంకులకు పరుగులు తీశారు. జూన్ 1న పింఛన్లు అందకపోవడం... 2న ఆదివారం సెలవు కావడంతో 3న సోమవారం బ్యాంకుల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు క్యూ కట్టారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దయ వల్ల ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటి వద్దే నగదు అందించేవారని... చంద్రబాబు, అతని దత్తపుత్రుని కుట్రల వల్ల ఇలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు. వారిద్దరికీ మా ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నామని పండుటాకులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బ్యాంక్ సిబ్బందిపైనా పని ఒత్తిడి పెరిగింది. – డాబాగార్డెన్స్


అవస్థలు పడుతూ బ్యాంకుకు వెళ్తున్న వృద్ధురాలు


బ్యాంక్‌కు వెళ్తున్న పింఛనుదారు




ఏవీఎన్ కళాశాల ఇండియన్ బ్యాంక్ బ్రాంచి వద్ద పింఛన్ కోసం క్యూలైన్లలో నిల్చున్న వృద్ధులు

ఉత్కంఠకు నేడే తెర

పార్టీల నాయకులు, కార్యకర్తల్లో టెన్షన్


వాసుపల్లి గణేష్‌కుమార్


వంశీకృష్ణ శ్రీనివాస్


విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని ఓ ప్రాంతం

డాబాగార్డెన్స్ : ఇంకా కొద్ది గంటలే..! కౌంట్‌డౌన్ తుది ఘట్టానికి చేరింది. ఎన్నికల కౌంటింగ్‌కు అంతా సిద్ధమైంది. మీట నొక్కితే జనం మనోగతం స్క్రీన్ మీద మెరిసే తరుణం ఆసన్నమైంది. ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఇటు పోటీ చేసిన నాయకులు, ఆయా పార్టీల కార్యకర్తలు, అభిమానుల్లో అటెన్షన్ మొదలైంది. ఈ నేపథ్యంలోనే బెట్టింగ్ జోరుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కోట్లాది రూపాయలు బెట్టింగ్ జరిగినట్టు సమాచారం. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,16,770 మంది ఉండగా, వీరిలో 1,06,444 మంది పురుషులు, 1,10,293 మంది మహిళలు, 33 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరిలో 66,260 మంది పురుషులు, 71,209 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఓటు వినియోగించుకున్నారు. 2,16,770 మంది ఓటర్లలో 1,37,474 మంది ఓటు వినియోగించుకున్నారు. ఈ మొత్తంలో ఎవరికి అత్యధిక ఓట్లు పోలయ్యాయో... ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో అదృష్టం ఎవరిని వరించనుందో? కొద్ది సేపటిలో తేలనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్, జనసేన అభ్యర్థిగా వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు పోటీ చేసినా... ప్రధాన పోటీ వాసుపల్లి, వంశీకృష్ణ మధ్యే నెలకొంది. వాసుపల్లి గణేష్‌కుమార్‌కే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మత్స్యకారులు, ముస్లిం మైనార్టీలు, కాపు, వెలమ, వాడ, శెట్టిబలిజ ఓటర్లు వాసుపల్లి గణేష్‌కుమార్ వైపు మొగ్గినట్టు సర్వేలు చెబుతున్నాయి.

గత ఎన్నికల్లో ఫలితాలు ఇలా...

2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్ గెలుపొందారు. 35.66 శాతంతో 45,971 ఓట్లు సాధించి ద్రోణంరాజు గెలుపొందారు. ఆ ఎన్నికల్లో 35.40 శాతంతో 45,630 ఓటు సాధించిన ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి కోలా గురువులు ఓటమి పాలయ్యారు. వీరిద్దరి మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 341 మాత్రమే. తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన వాసుపల్లి గణేష్‌కుమార్ 18.78 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. అనంతరం 2014 ఎన్నికల్లో 51.45 శాతంతో 66,686 ఓట్లు సాధించిన వాసుపల్లి గణేష్‌కుమార్ విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కోలా గురువులు 48,370 ఓట్లతో ఓటమి పాలయ్యారు. 18,316 ఓట్ల మెజార్టీని వాసుపల్లి సాధించారు. 2019 ఎన్నికల్లో వాసుపల్లి గణేష్‌కుమార్ తన సమీప ప్రత్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై 3,729 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే వాసుపల్లి గణేష్‌కుమార్ వైఎస్సార్ సీపీకి మద్దతు పలికారు. వాసుపల్లి గణేష్‌కుమార్ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల నిఘా


పండా వీధిలో పహరా కాస్తున్న పోలీసులు


వెలంపేట వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి వన్ టౌన్ ప్రాంతంలో పోలీసులు నిఘా పెంచారు. సీపీ రవిశంకర్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహరా కాస్తున్నారు. రెల్లివీధి, జాలరిపేట, కోడిపందెలవీధి, పూర్ణామార్కెట్ పరిధి పండావీధి, వెలంపేట, టౌన్ కొత్త రోడ్డు ప్రాంతాల్లో వన్‌టౌన్ సీఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టారు. మద్యం అక్రమ విక్రయాలు జరిగే పండావీధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జనాలు గుంపుగా ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దాం

- స్టీల్ సీఐటీయూ పిలుపు
- 14న రక్తదాన శిబిరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టీల్ సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ జూన్ 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె రాజు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఇసుకతోట యూపీహెచ్‌సీ వైద్యాధికారి ప్రేరణ

మద్దిలపాలెం : మలేరియాపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రేరణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్య కేంద్రం వద్ద జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం దోమ కాటు ద్వారా సంక్రమిస్తుందన్నారు. దోమలు వృద్ధి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వై.వి.రత్నం, ఆరోగ్య కార్యకర్తలు పాతకోకిల శేషుబాబు, మళ్ల రామునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న తైనాల విజయ్‌కుమార్ దంపతులు


కార్పొరేటర్ కంపా హనోకును సత్కరిస్తున్న ఉమా రామలింగేశ్వరాలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి రామచంద్రనగర్‌లోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ శాశ్వత ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ దంపతులు, భక్తులు, పేరంటాళ్ల సమక్షంలో వేదపండితుల శాస్త్రోక్త ఆశీర్వచనాలతో కల్యాణం నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పైడి నాగరాజు, ముప్పిడి రామారావు, గణపతి లక్ష్మణరావు, రమణ, పార్టీ నాయకులు హరి పట్నాయక్, రాజు యాదవ్, నానిబాబు, దుర్గ, సన్ని, పైడి శ్రీను, కత్తుల ప్రభాకరరావు, హరికృష్ణ, ఆదిలక్ష్మి, సువర్ణ, తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలికుల సంఘం కార్యాలయం ప్రారంభం


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దాడి సత్యనారాయణ, తదితరులు

డాబాగార్డెన్స్: దండుబజార్ సమీపంలో ఏర్పాటు చేసిన అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ఆ సంఘం అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పెబ్బిలి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘానికి మంచి చేయాలనే లక్ష్యంతో తెలికుల కులస్తులను ఒక తాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఏర్నేటి తాతారావు, చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్, ఎర్నేటి సన్యాసిరావు, కనక సూర్య పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ ఆర్.రాజేంద్రరావు (36) అదృశ్యమైన ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం వెలగవలసకు చెందిన రాజేంద్రరావు స్టీల్‌ప్లాంట్ యూనిట్‌లో పని చేస్తూ అక్కడి బ్యారక్స్‌లో ఉంటున్నారు. రాజేంద్రరావు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బ్యారక్స్ నుంచి లుంగీతో బయటకు వెళ్లిన రాజేంద్ర తిరిగి బ్యారక్స్‌కు చేరలేదు. దీంతో సీఐఎస్ఎఫ్ ఎస్ఐ అందించిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'5న హాజరు కావాలి'

అగనంపూడి: ఉక్కు కార్మికుడు నాట్ర తాతారావుతో 29 సంవత్సరాలు పని చేయించుకుని, వచ్చిన జీతంలో నిబంధనల మేరకు పీఎఫ్ కోత విధించినా నెలవారి పింఛన్ చెల్లింపులో ఉక్కు యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తున్న తీరుపై రీజనల్ లేబర్ కమిషనర్ ఈ నెల 5వ తేదీన హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆదేశించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన తరువాత జాతీయ భద్రతా పెన్షన్ పథకంలో కనీస పింఛన్ చెల్లించాలి. అయితే ఈ విషయంలో ఉక్కు అధికారులు, ఈపీఎఫ్ అధికారుల ద్వంద్వ వైఖరిపై తాతారావు ఆర్ఎల్‌సీకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన 5న హాజరు కావాలని ఆదేశించారు. అలాగే దేవర అప్పలకొండ అనే వితంతువును ఆమె ఆధార్ కార్డు ఆధారంగా చేసుకుని విధుల నుంచి తొలగించడంపై కూడా ఉక్కు యాజమాన్యం హాజరు కావాలని ఆర్ఎల్‌సీ ఆదేశించింది.

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీకి అభినందనలు


ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి నవీన్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని విభాగాధిపతిని కోరారు. ఆస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, బి.ఎస్.రాజు, బి.టి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీత


జగదాంబ వద్ద పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: వర్షాలు నేపథ్యంలో కాలువలు బ్లాక్ అవ్వకుండా ముందస్తుగా పూడిక తీత చర్యలు చేపట్టినట్టు జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు కాలువలు, పార్కుల్లో పేరుపోయిన చెత్తను సోమవారం ఆయన సిబ్బందితో తీయించారు. జగదాంబ జంక్షన్, టౌన్ కొత్తరోడ్డు వద్ద ఉన్న కాలువలను శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అన్ని ప్రాంతాల్లో ఉన్న షిల్ట్‌చాంబర్స్‌ను శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా అప్పన్న నిత్యకల్యాణం


స్వామికి వస్త్రాలు సమర్పిస్తున్న లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ దంపతులు


హాజరైన ఉభయదాతలు, భక్తులు

- పాల్గొన్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణదారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేట సన్నాహాల్లో మత్స్యకారులు


అప్పుఘర్‌లో వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

ఎంవీపీ కాలనీ: వేట విరామం గడువు దగ్గరకు వస్తుండడంతో మత్స్యకారులు వేటకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చేపల వేటకు అవసరమైన వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొద్ది రోజులుగా అప్పుఘర్, జాలరిపేటలో చాలా మంది మత్స్యకారులు ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏటా వేట విరామం పాటిస్తుండడంతో రెండు నెలలుగా మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. ఈ నెల 15వ తేదీతో ఆ గడువు ముగియనుండడంతో చేపల వేటకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకునే పనిలో మత్స్యకార గ్రామాలు నిమగ్నమయ్యాయి. ఈ మేరకు 18, 19 వార్డుల్లో అప్పుఘర్, వాసవానిపాలెం, పెదజాలరిపేటలో ఎక్కడ చూసిన మత్స్యకారుల సన్నద్ధత దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. గుంపులు, గుంపులుగా మత్స్యకారులు వలలు బాగుచేసుకుంటుండటంతో పాటు బోట్లు, ఇంజిన్లను సరిచేసుకుంటూ వేటకు సిద్ధమవుతున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం యల్లబిల్లివారి వీధిలోని గౌరీపరమేశ్వరుల ఆలయ 10వ వార్షికోత్సవం సోమవారం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాజు, వీర్రాజు, లక్ష్మి, కుమారి, ప్రశాంత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.